క్లుప్తంగా

నేడు మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణం

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం 11.30 మార్కెట్ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తూర్పు నిర్మలారెడ్డి హాజరు కానున్నారని ప్రస్తుత మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కందికృష్ణ తెలిపారు.

క్రికెట్‌లో గంగాపూర్ జట్టు విజయం



కప్‌ను అందిస్తున్న ప్రజాప్రతినిధులు

మర్కూక్(గజ్వేల్): క్రికెట్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో మర్కూక్‌లో నిర్వహించిన పోటీల్లో గంగాపూర్ జట్టు ప్రథమ స్థానంలో గెలిచింది. ఆదివారం ప్రథమ, ద్వితీయ జట్లకు ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం బహుమతులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఐలేని యాదవ్, ప్రధాన కార్యదర్శి సంతోష్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు కనకయ్య, మాజీ సర్పంచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

60 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకుడు

కోహెడ(హుస్నాబాద్): 'మండల ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎంపీటీసీ సభ్యురాలు ఖమ్మం స్వరూప శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 60 మంది రక్తదానం చేశారు. నిర్వహకులను ఎంపీటీసీ అభినందించారు. కార్యక్రమంలో బండ జగన్‌యాదవ్, ప్రభాకర్‌గౌడ్, పాలు శ్రీనివాస్, పరంధాములు, చంద్రమౌళి, గూడూరు ఆంజనేయులు, ముత్యంరెడ్డి సురేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ బిల్లుల అందజేత



లబ్ధిదారులకు జీరో విద్యుత్తు బిల్లును అందజేస్తున్న మల్లేశం

కొండపాక(గజ్వేల్): గృహజ్యోతి పథకంలో భాగంగా ఆదివారం ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏర్పుల మల్లేశంతో పాటు విద్యుత్తు సిబ్బంది ఉచిత విద్యుత్ బిల్లు రశీదును అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా 70 రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు వాడకం దారులకు ఉచితం విద్యుత్తు పథకాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు అంబటి రాజు, పంబాల సురేందర్, ఎర్ర నర్సింలు, రాంచంద్రం, నారాయణ, నల్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను చేర్యాల పోలీసులు సీజ్ చేశారు. మండల పరిధిలోని దానంపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ సతీశ్, వెంకట్, కరుణాకర్ ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఆదివారం ఎస్ఐ ఓ.దామోదర్ తెలిపారు.



సిద్దిపేటజోన్: మున్సిపల్ చైర్మన్ మంజుల



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో ఎంపీపీ నిర్మల



కొమురవెల్లి(సిద్దిపేట): ఎంపీపీ తలారి కీర్తన



చేర్యాల(సిద్దిపేట): చైర్ పర్సన్ స్వరూపరాణి

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

జిల్లా వ్యాప్తంగా అయిదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లోను అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చుక్కలు వేయించారు.

మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత



హుస్నాబాద్: పోలియో చుక్కలు వేస్తున్న ఆకుల రజిత

హుస్నాబాద్: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత పిలుపునిచ్చారు. పట్టణంలోని శివాజీనగర్‌లో పోలియో కేంద్రాన్ని ప్రారంభించి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగ వైకల్యాన్ని అరికట్టేందుకు ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రభాకర్, మెడికల్ ఆఫీసర్ నిఖిత, కౌన్సిలర్లు బోజు రమా, వాల సుప్రజ, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుబ్బాకలో.. అయిదేళ్లలోపు పిల్లలకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని పలువురు కౌన్సిలర్లు పిలుపునిచ్చారు. మున్సిపల్ పరిధిలోని తమతమ వార్డులలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పిల్లల బంగారు భవిష్యత్‌కు రెండు పోలియో చుక్కలు ఎంతో అవసరమన్నారు. ఈ బాలకృష్ణ గౌడ్, బత్తుల స్వామి, కనకయ్య, ఆస యాదగిరి, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎర్రవల్లిలో మరిచిపోయారు..



ఎర్రవల్లిలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద గ్రామస్తులు

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ(ఎర్రవల్లి)లో పల్స్ పోలియో కేంద్రం ఏర్పాటును అధికారులు మరిచిపోయారు. దీంతో ఆగ్రహానికి గురైన గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గంట ఆలస్యంగా ప్రారంభించారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురైన ఎర్రవల్లి గ్రామం గతంలో కుకునూర్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలో ఉండేది. కాగా ఎర్రవల్లి గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలోకి మారడంతో కుకునూర్‌పల్లి పీహెచ్‌సీ నుంచి తొలగించారు. ఆదివారం పల్స్ పోలియోలో భాగంగా ఎర్రవల్లిలో ఏర్పాట్లు చేయలేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రం వద్దకు పోలియో చుక్కలు వేయించేందుకు వచ్చిన తల్లిదండ్రులు అధికారుల తీరుపై మండిపడ్డారు. గ్రామంలో సుమారు 2వేల జనాభా ఉండగా. ఐదేళ్లలోపు 150మంది చిన్నారులున్నారని, తమ గ్రామంలో పోలింగ్ కేంద్రం ఎందుకు ఏర్పాటు చేయలేదని నిలదీశారు. ఈ విషయాన్ని వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో శ్రీగిరిపల్లి పీహెచ్‌సీకి చెందిన వైద్యులు ఆలస్యంగా చేరుకొని పోలియో చుక్కల కార్యక్రమాన్ని చేపట్టారు.

పోలియో చుక్కలు వేయించాలి

దుబ్బాకరూరల్: మండలంలోని బల్వంతాపూర్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ముద్దాస్సర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డల నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రఘోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చుక్కల మందుకు చక్కని స్పందన

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎంపీపీ బాలేషంగౌడ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి తల్లీ తప్పకుండా వేయించాలి

తొగుట(దుబ్బాక): పోలియోరహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాన్గల్ గ్రామంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రతి తల్లీ తప్పకుండా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఎల్లారెడ్డిపేట క్రషర్ వద్ద 25మంది వలస కారిమకుల పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు వైద్యాధికారి రాధాకృష్ణ తెలిపారు.

పోలియో రహిత మండలంగా..

మర్కూక్(గజ్వేల్): పోలియో రహిత మండలంగా మార్చాలని ఎంపీపీ పాండుగౌడ్ అన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో వైద్యాధికారులు 5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గ్రామాలలో.. ఉత్సాహంగా..

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించారు. లకుడారం గ్రామంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ పిల్లలకు పోలియో చుక్కలను వేశారు. దుద్దెడ, ఖమ్మంపల్లి, కొండపాక, సిర్సనగండ్ల, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

1546 మంది చిన్నారులకు..

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండలంతో పాటు, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలో చక్కని స్పందన లభించింది. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ టీచర్లు పోలియో చుక్కలు వేశారు. మండల వ్యాప్తంగా 1706గాను 1546 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ అమీనా సుల్తానా తెలిపారు. మిగిలిన చిన్నారులకు సోమ, మంగళ వారాల్లో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తామని వెల్లడించారు.

కోహెడలో 96 శాతం

కోహెడ(హుస్నాబాద్): మండల వ్యాప్తంగా 2549 మంది చిన్నారులకు పల్‌పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యురాలు నిర్మా తెలిపారు. కార్యక్రమానికి 30 సెంటర్లు, 120 మంది వాలంటీర్లతో పాటుగా 1 మొబైల్ వాహనాన్ని వినియోగించినట్లు పేర్కొన్నారు. అలాగే బ్రిక్స్ సెంటర్లోని 90 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు.



గజ్వేల్‌రూరల్: ప్రభుత్వాసుపత్రిలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి

మండల వ్యాప్తంగా పల్స్‌పోలియో

కొమురవెల్లి(సిద్దిపేట): మర్రిముచ్చాల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని ఎంపీపీ తలారి కీర్తన, మల్లన్న ఆలయ పరిసరాలలో ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. కొమురవెల్లి పీహెచ్‌సీ వైద్యులు ఆచార్య విపిన్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పండుగలా ..

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి ప్రారంభించారు. 11వార్డులలో ఆయా వార్డు కౌన్సిలర్లు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండడానికి పోలియో చుక్కలు ఎంతో దోహద పడతాయన్నారు. వైద్యులు, సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



దుబ్బాక: పోలియో చుక్కలు వేస్తున్న బాలకృష్ణ గౌడ్



జగదేవ్‌పూర్‌లో ఎంపీపీ బాలేషంగౌడ్



మర్కూక్‌లో ఎంపీపీ పాండుగౌడ్



కొండపాక(గజ్వేల్): లకుడారంలో దేవి రవీందర్



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో..

మోడల్‌స్కూల్లో ప్రవేశాలకు 11వరకు గడువు

ప్రిన్సిపాల్ గోపి

గజ్వేల్‌రూరల్: మోడల్‌స్కూల్లో 6, 7, 10వ తరగతుల్లో సీట్లభర్తీ కోసం దరఖాస్తుల స్వీకారానికి గడువు పొడగించామని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల తెలంగాణ మోడల్‌స్కూల్లో 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జనరల్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఇతర విద్యార్థులు రూ.125తో మార్చి 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 6వ తరగతిలో ప్రవేశం కోసం ఏప్రిల్ 7న ఉదయం 10 నుంచి 12గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. హాల్ టికెట్లను ఏప్రిల్ 1 నుంచి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, మోడల్‌స్కూల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కులరహిత సమాజం అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, ప్రతినిధులు

సమరసత రాష్ట్ర కన్వీనర్ ప్రసాద్

సిద్దిపేటజోన్: కులరహిత సమాజం కోసం కృషిచేయాలని సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం అంబిటస్ పాఠశాలలో 'సమత్వ సాధనలో సౌజన్య మూర్తులు' అనే పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పంతాలు, సంప్రదాయాలు, సిద్ధాంతాలలో భిన్నత్వం ఉన్నప్పటికీ మనిషిని, మనిషిగా గౌరవించే ఏకత్వం మన దేశంలో ఉందన్నారు. మన దేశంలో ఎన్నో వైవిధ్యమైన ఆలోచన, ఆచారాలు ఉన్నాయని ప్రముఖ కవి డాక్టర్ భాస్కర్ అన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు రత్నం, నరేశ్, అరవింద్, రుక్మిణి, రాజశేఖర్, బాలయ్య, మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

జగదేవ్‌పూర్(గజ్వేల్): పట్టణ కాంగ్రెస్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడిగా నర్సింహ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్, శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా నర్సింలు, యూత్ అధ్యక్షుడిగా వెంకటేశ్, బీసీ పట్టణ అధ్యక్షుడిగా నర్సింలు, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడిగా ఐలయ్య, మైనార్టీ అధ్యక్షుడిగా అమినొద్దీన్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

సిద్దిపేటజోన్: బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని హిందూ మాజ్దూర్ సభ జిల్లా అధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో బీడీ కమిషన్ టేకేదార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీడీ కార్మికుల అగ్రిమెంట్ మార్చి నెలాఖరులోగా ముగుస్తుందని, ప్రస్తుతం వెయ్యి బీడీలకు ఇస్తున్న కూలీరేటును పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, సత్యం, పెంటయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

10న మంత్రి పొన్నం సన్మాన సభ

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్‌లో పదోతేదీన నిర్వహించే రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు చేప్యాల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని గుగ్గిల్ల, గాగిళ్లాపూర్, వడ్లూర్ తదితర గ్రామాల్లో ఆదివారం కరపత్రాలను పంపిణీ చేశారు. గౌడ సంఘం నాయకులు, ఎంపీటీసీ కొమిరె మల్లేశం, మురళి, రాజు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సంపూర్ణ జ్ఞానం



చిన్నారులతో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): చదువుతోనే సంపూర్ణ జ్ఞానం లభిస్తుందని, తద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ అన్నారు. మండల పరిధిలోని చంద్లాపూర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువే అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందుతుందని చెప్పారు. అన్ని వసతులు, ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం వంటివి ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ దేశిరెడ్డి, హెచ్ఎం పద్మారెడ్డి, ఎంపీటీసీ దుర్గారెడ్డి, నాయకులు చంద్రమౌళి, శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చైతన్యంతోనే మూఢ నమ్మకాల నిర్మూలన

ఎస్ఐ పరశురామ్



సైన్స్ షో నిర్వహిస్తున్న నరేశ్

మిరుదొడ్డి(దుబ్బాక): సమాజంలో ప్రతి ఒక్కరు చైతన్యవంతమైతేనే మూఢ నమ్మకాల నిర్మూలన సాధ్యమవుతుందని మిరుదొడ్డి ఎస్ఐ బోయిన పరశురామ్ అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం మహిళల రక్షణ-మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేశ్ సైన్స్ మ్యాజిక్‌తో మూఢనమ్మకాలపై ప్రత్యేక షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అంధ విశ్వాసాలు నమ్మడం దురదృష్టకరమన్నారు. స్త్రీ విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. విద్యార్థి దశ నుండే మూఢ నమ్మకాలను వీడి సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రజల అయాయకత్వాన్ని ఆసరాగా చేసుకొంటున్న దొంగ బాబాలు, భూత వైద్యులు మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత, పోలీస్ సిబ్బంది, విద్యాలయం టీచర్లు తదితరులు పాల్గొన్నారు.